ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
మంగళవారం 20 మే 2025



రేపు మెగా జాబ్‌మేళా

పాలకొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీసత్యసాయి డిగ్రీ కాలేజీలో ఈ నెల 21న బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మెగా జాబ్‌మేళాకు ఐదు అంతర్జాతీయ ఫార్మా కంపెనీ ప్రతినిధులు హాజవుతారని, 600 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, బీఎస్సీ, ఎంఎస్సి చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. తమ వివరాలను క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9490800213, 6303204295, 8142194787 నెంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

ఘనంగా తొలేళ్లు

● భక్తజన సంద్రంగా సాలూరు పట్నం



తొలేళ్ల ఉత్సవాన్ని ప్రారంభించిన యాదవ వీధి ప్రజలు



ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): సాలూరు గ్రామదేవత శ్యామలాంబ పండుగలో భాగంగా తొలేళ్ల ఉత్సవం సోమవారం పెదకోమటిపేట అమ్మవారి గద్దె వద్ద అత్యంత వైభవంగా జరిగింది. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, పట్టణ యువరాజు విక్రమచంద్ర సన్యాసిరాజు (యువరాజు), ఉత్సవ కమిటీ పర్యవేక్షణలో ఈ తంతు సాగింది. ముందుగా పట్టణంలోని యాదవవీధికి చెందిన కొందరు కర్రలను పైకెత్తి చప్పుడు చేస్తూ వీధుల్లో పర్యటించారు. వీరు అల్లువీధి, అక్కేనవీధి వాసుల వద్దకు వెళ్లి అమ్మవారి గద్దె వద్ద పూజలు చేశారు. ఆపై విత్తనాల బుట్టను శ్యామలాంబ ఆలయానికి తీసుకువెళ్లి చివరిగా పెదకోమటిపేట గద్దె వద్దకు చేరుకున్నారు. అనంతరం డబ్బీవీధి, మెంటాడ వీధివాసులు కూడా కర్రలు పైకెత్తి చప్పుడు చేస్తూ గద్దె వద్దకు చేరుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు మేళాలతో యువరాజు ఇంటికి వెళ్లి ఉత్సవానికి ఆహ్వానించారు. మేళతాళాలతో ఆయనను తొలేళ్ల ఉత్సవానికి తీసుకువచ్చారు. అనంతరం విత్తనాల బుట్టకు పూజలు చేశారు. ముందుగా నిర్ణయించిన విధంగా అక్కేనవీధివాసులు పూజను పలుపుతాళ్లతో కట్టి అమ్మవారి గద్దె వద్ద ప్రదక్షిణ చేశారు. అనంతరం అల్లువీధి, యాదవవీధి, డబ్బీవీధి, మెంటాడ వీధివాసులు ఒకరి తరువాత ఒకరు పూజలో పాల్గొన్నారు. డీఎస్పీ రాంబాబు, సీఐ రామకృష్ణలు బందోబస్తును పర్యవేక్షించారు. ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన (మిగతా 8వ పేజీలో..)

నేడు సిరిమానోత్సవం

అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రధాన ఘట్టమైన సిరిమానోత్సవం జరగనుంది. సాయంత్రం నాయుడు వీధిలో ప్రారంభమయ్యే సిరిమానోత్సవం శివాజీ బొమ్మ, బోసుబొమ్మ, మెయిన్‌రోడ్డు మీదుగా డీలక్స్ సెంటర్‌కు చేరుకుంటుంది. అక్కడి నుంచి కోట జంక్షన్ మీదుగా పెదకోమటిపేట, డబ్బీవీధి, దండిగాం రోడ్డు చేరుకుంటుంది. తిరిగి బోసుబొమ్మ నుంచి శివాజీ బొమ్మ, శివాజీ బొమ్మ నుంచి అక్కేన వీధి రామమందిరం, అక్కడి నుంచి తోటవీధిలో ఉన్న శ్యామలాంబ అమ్మవారి ఆలయానికి సిరిమాను చేరుకోనుంది.



మృతిచెందిన విద్యార్థులు

ప్రాణం తీసిన ఈత సరదా

● గెడ్డలో మునిగి ఇద్దరు యువకుల మృతి ● బాధితులది కృష్ణా జిల్లా నూజివీడు



రాము (ఫైల్) ఈశ్వర్‌కుమార్ (ఫైల్)

పార్వతీపురం రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): పులిగుమ్మి గ్రామంలో సోమవారం సాయంత్రం దారుణం జరిగిపోయింది. వివాహ శుభకార్యానికి వచ్చిన ఇద్దరు యువకులు గెడ్డలోకి స్నానానికి దిగి ఈతరాక మునిగిపోయారు. వీరిది కృష్ణా జిల్లా నూజివీడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పులిగుమ్మి గ్రామానికి చెందిన మడక గుంపుస్వామి కుమారుడు శేఖరానికి నూజివీడుకు చెందిన అమ్మాయితో బుధవారం వివాహం జరుగనుంది. పెళ్లి కుమార్తె తమ్ముడు, అతన్ని స్నేహితులు నలుగురు పెళ్లి ఏర్పాట్లు చేసేందుకు సోమవారమే గ్రామానికి వచ్చారు. వారంతా కలిసి సాయంత్రం పులిగుమ్మి సమీపంలో ఉన్న గెడ్డలోకి స్నానానికి దిగారు. స్నానం చేస్తుండగా కొద్దిసేపటికి బొత్స ఈశ్వర్‌కుమార్(16), నగిరెడ్డి రాము (16)లు ఉన్నట్టుండి మునిగిపోయారు. ఊబిలోకి దిగబడిపోయారు. ఇది చూసిన మిగతా వారు వెంటనే చుట్టుపక్కల గ్రామస్థులను పిలిచారు. వారొచ్చి కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం అలముకుంది.



మీ పిల్లలను చూస్తున్నారా?

6లో..



ఖరీఫ్ సమీపిస్తోంది.. కొద్దిరోజుల్లో రైతులు పొలంబాట పట్టనున్నారు. ఇప్పటికే సన్నాహాల్లో నిమగ్నమయ్యారు. ఇటు సాగునీటి పరిస్థితి చూస్తే ఏమాత్రం ఆశాజనకంగా లేదు. ప్రాజెక్టులు, కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడమే ఇందుకు కారణం. కనీసం తాత్కాలిక పనులకూ మోక్షం లభించలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్‌డీఎంఎఫ్ నిధులు మంజూరు చేసినా పనులు చేపట్టడం లేదు. దీనిపై రైతులు తీవ్ర నిరాశ పడుతున్నారు.

● ప్రాజెక్టుల దుస్థితిపై ఆవేదన చెందుతున్న రైతులు
● ఎస్‌డీఎంఎఫ్ నిధులున్నా ముందుకు కదలని పనులు
● దయనీయంగా ప్రాజెక్టుల కాలువలు
● 2025-26 ఖరీఫ్‌కు సాగునీరు ప్రశ్నార్థకమే

వట్టిగెడ్డలో ఆధునికీకరణ చేసిన కాలువ దుస్థితి

ఆధునికీకరణ లేకపోయె

జియ్యమ్మవలస, మే 19 (ఆంధ్రజ్యోతి)

వచ్చే ఖరీఫ్‌లో సాగునీటికి రైతులకు తిప్పలు తప్పేటట్టు లేవు. జపాన్ ఇంటర్నేషనల్ కోపరేషన్ ఏజెన్సీ (జైకా) నిధులు మంజూరైనా వైసీపీ సర్కారు పుణ్యమా అని ప్రాజెక్టుల ఆధునికీకరణ పనులు చేపట్టలేదు. అప్పటి నుంచి నిరాశతో ఉన్న రైతులు ఈ ఏడాది పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుందో, లేదోనని దిగులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా జైకా నిధులు మంజూరైనా ప్రాజెక్టుల ఆధునికీకరణ పనులకు అతీగతీ లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పనులు మంజూరైనా నీటి పారుదలశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల సకాలంలో జరగడం లేదు. వర్షాకాలం సమీపిస్తుండడంతో పనులు చేస్తారన్న నమ్మకమూ రైతుల్లో సడలుతోంది.



పాచిపెంటలో పెద్దగెడ్డ ప్రధాన కాలువ దుస్థితి


అటకెక్కిన ఆధునికీకరణ..

జిల్లాలో మీడియం ఇరిగేషన్‌కు సంబంధించి ఒట్టిగెడ్డ, వెంగళరాయ సాగర్, పెద్దగెడ్డ, పెదంకలాం ప్రాజెక్టుల ఆధునికీకరణకు టీడీపీ ప్రభుత్వ హయాం చివరి దశ అంటే 2018-19 ఆర్థిక సంవత్సరంలో జైకా నిధులు రూ.153.33 కోట్లు మంజూరయ్యాయి. వీటి ద్వారా పార్వతీపురం మన్యం జిల్లాలో 59,997 ఎకరాలు, విజయనగరం జిల్లాలో 1,636.47 ఎకరాలు కలిపి మొత్తం 61,633.47 ఎకరాలకు సాగునీరందించేలా పనులు చేయాల్సి ఉంది. కానీ వైసీపీ ప్రభుత్వ హయాం ఐదేళ్లలో కనీసం 10 శాతం పనులు కూడా చేపట్టలేదు. పనులు జరిగి ఉంటే ఒట్టిగెడ్డ రిజర్వాయర్ ద్వారా జియ్యమ్మవలస మండలంలో 16,680 ఎకరాలు, వెంగళరాయసాగర్ ద్వారా మక్కువ మండలంలో 14,550 ఎకరాలు, బొబ్బిలి మండలంలో 6,427.27 ఎకరాలు, సీతానగరం మండలంలో 3,723 ఎకరాలు కలిపి ఈ ప్రాజెక్టు ద్వారా 24,700 ఎకరాలకు సాగునీరందేది. అలాగే పెద్దగెడ్డ ద్వారా మూడు మండలాల (మిగతా 8వ పేజీలో..)

200 కిలోల పసుపు కొమ్ములతో దేవీ విగ్రహం

సాలూరు శ్యామలాంబ పండుగను పురస్కరించుకుని జయపూర్ రోడ్డులో ఓ దుకాణం ముందు 200 కిలోల పసుపుకొమ్ములతో దేవి విగ్రహాన్ని తయారు చేశారు. ఈ విగ్రహానికి అందరూ నమస్కరిస్తూ ఫొటోలు దిగుతున్నారు.

-సాలూరు రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి)



ఇవి కాటేస్తే ప్రమాదమే

6లో



21 నుంచి యోగా మాసోత్సవం

పార్వతీపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): యోగా మాసోత్సవాన్ని ఈ నెల 21వ తేదీ నుంచి చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. వివిధ అంశాలపై కలెక్టర్లతో సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా మాసోత్సవం జరుగుతుందన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించాలని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, జిల్లా రెవెన్యూ అధికారి హేమలత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి భాస్కరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆరు వారాల్లో చెక్ డ్యామ్‌లు పూర్తి కావాలి

● కలెక్టర్ శ్యాంప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాం ప్రసాద్

పార్వతీపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న చెక్‌డ్యామ్‌లు, చెరువుల పనులు ఆరు వారాల్లో పూర్తి కావాలని కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తన చాంబర్‌లో సోమవారం జలవనరుల శాఖ పనులపై సమీక్షించారు. జిల్లాలో 39 చెక్‌డ్యామ్‌లు, 122 చెరువులు, 40 ఇతర పనులను చేపట్టేందుకు మంజూరు ఉత్తర్వులు ఇచ్చినట్టు చెప్పారు. వర్షాకాలం సమీపిస్తున్నందున ఈలోగా పనులను పూర్తి చేయాలన్నారు. మంజూరు చేసిన పనులన్నీ ఆరు వారాల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులతో చర్చించి త్వరగా పనులను ప్రారంభించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీలో జిల్లాకు కేటాయించిన రూ.210 కోట్ల నిధుల్లో ప్రప్రథమంగా జల వనరుల శాఖ పనులకే తొలి ప్రాధాన్యం ఇచ్చామని, తద్వారా రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చిన కాంట్రాక్టర్లతో త్వరగా పనులు ప్రారంభించి చేయాలన్నారు. సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాల్లో ఒక్కపనికూడా ప్రారంభం కాలేదని, దీనిపై ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఎంత త్వరగా పనులు పూర్తి చేస్తే అంత త్వరగా నిధులు విడుదల అవుతాయని, ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. సమావేశంలో జిల్లా నీటియాజమాన్య సంస్థ పథక సంచాలకుడు కె.రామచంద్రరావు, జల వనరులశాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ ఆర్.అప్పలనాయుడు, సహాయ ఇంజనీర్లు, జూనియర్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

పీఎం జన్మన్ పనులు గ్రౌండింగ్ కావాలి..

జిల్లాలో పీఎం జన్మన్ పథకం కింద నిర్మిస్తున్న గృహ నిర్మాణ పనులు మరింత వేగవంతం కావాలని కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు గ్రౌండింగ్ కాని గృహాలను వెంటనే గ్రౌడింగ్ చేయాలని, మొత్తంగా పీఎం జన్మన్ పనులు జిల్లాలో బాగా జరగాలని కలెక్టర్ సూచించారు. సోమవారం తన కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రాయోజిత కార్యక్రమాలైన పీఎం జన్మన్, పీఎం సూర్యఘర్ పథకాలలో మరింత వేగం కనిపించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శోభిక, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, కెఆర్ఆర్‌సి ప్రత్యేక ఉపకలెక్టర్ డాక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డిఆర్‌డిఏ పిడి ఎం.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

మీ పిల్లలను చూస్తున్నారా?

- సరదా మాటున విషాదం
- సెలవుల్లో ఓ కన్నేయండి
- ఆటపాటలపైనా దృష్టి పెట్టండి
- ప్రమాదాల నుంచి కాపాడండి



● ఈ నెల 16న కొత్తవలస మండలం తుమ్మకాపల్లి పంచాయతీ శివారు జనార్దన్ నగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో అసూర లేఖన్ కుమార్ అనే ఏడేళ్ల బాలుడు మృతిచెందాడు. వేసవి సెలవుల కోసం అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళ్లాడు. ఇంటి ఎదురుగా ఉన్న షాపునకు వెళ్లి వస్తుండగా లక్కవరపుకోట వైపు వెళుతున్న లారీ ఢీకొట్టింది. ఘటనా స్థలంలోనే లేఖన్ కుమార్ కన్నుమూశాడు.

● ఈ నెల 18న ద్వారంపూడిలో నలుగురు చిన్నారులు కారులో చిక్కుకొని ప్రాణాలు కోల్పోయారు. ఆటలాడుకుంటూ కారు ఎక్కగా.. దాని లాక్ ఆటోమేటిక్‌గా పడిపోయింది. దీంతో అందులో చిక్కుకొని ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన ఆ కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని మిగిల్చింది.

రాజాం, మే 19 (ఆంధ్రజ్యోతి)

పిల్లలకు అతిపెద్ద పండుగ వేసవి సెలవులే. ఈ సమయంలో వారి ఆనందానికి పట్టపగ్గాలుండవు. ఎక్కువ మంది అమ్మమ్మల ఇళ్లకు వెళతారు. మరికొందరు బంధువుల ఇళ్లకు వెళతారు. సెలవుల్లో పిల్లల విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా మూల్యం చెల్లించుకోక తప్పదు. సైకిళ్ల పందాలు, ఈత పోటీలు, దాగుడు మూతలు... ఇలాంటివి బోలెడు ఆటలు ఆడుతుంటారు. సెలవులు శారీరంగానేగాక మానసిక వికాసానికి... ఉత్తేజానికి ... సృజనాత్మకతకు బాగా దోహదపడతాయి. వీటి మాటున పిల్లలు ప్రమాదాలు తెచ్చుకునే పరిస్థితులూ పొంచి ఉన్నాయి. తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తమ పిల్లలపై ఓ కన్నేసి ఉంచాల్సిన అవసరాన్ని ఇవి గుర్తు చేస్తున్నాయి. పిల్లల దైనందిన జీవన విధానం, ఆసక్తులు, స్నేహితుల నేపథ్యం తదితరాలను గమనిస్తూ ఉండాలి.



బహుళ అంతస్తులలో భద్రం..

బహుళ అంతస్తుల్లో నివసించే వారు తమ పిల్లల పట్ల జాగ్రత్తలు వహించాలి. అపార్ట్‌మెంట్ పార్కింగ్‌లో ఎన్నో కార్లు నిలిచి ఉంటాయి. ఉదాహరణకు దాగుడు మూతలు ఆడుతుంటారు. ఎవరికి కనిపంచకుండా ఉండాలన్న ఆతృతలో కారు డిక్కీలు, కార్లలో, వాటి కింద, అపార్ట్‌మెంట్ సన్‌షేడ్‌లలో దాక్కోవడం వంటివి పిల్లలు తరచూ చేస్తుంటారు. కారు డిక్కీ లాక్ అయితే ఊపిరాడక ప్రాణాల మీదకు వచ్చే ప్రమాదం ఉంది. సన్‌షేడ్‌లపై దాక్కోవడం వల్ల జారిపోయి... కింద పడేందుకు ఆస్కారం ఉంది. ఆటల్లో నిమగ్నమైన పిల్లలు పైఅంతస్తులకు వెళ్లేందుకు వేగంగా పరుగెడుతుంటారు. అటువంటి సమయంలో పట్టుతప్పి కింద పడిపోవచ్చు. వీటిని దృష్టిలో ఉంచుకుని పిల్లలను గమనిస్తూ ఉండాలి.

వాహనాలతో జాగ్రత్త..

చాలా మంది విద్యార్థులు ద్విచక్ర వాహనాలను నడిపేందుకు ఉవిళ్లూరుతుంటారు. కొంతమంది బైక్‌లపై రివ్వున దూసుకుపోతారు. ఇలా ఒక్కోసారి ప్రాణాల మీదకు తెచ్చుకుంటారు. 18 ఏళ్లు నిండని పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదు. కొందరు అత్యుత్సాహంతో తల్లిదండ్రులు నిద్రపోతున్న సమయాల్లో, తెల్లవారుఝామున, రాత్రివేళల్లో బైక్‌ల తాళాలు తీసుకుని చక్కర్లు కొడతారు. చాలా మంది వేగం, రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించడం లేదు. అర్ధ రాత్రి లాంగ్ డ్రైవ్ పేరిట వెళుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లలకు బైక్ తాళాలు అందనివ్వకూడదు. పిల్లలు నిరుత్సాహానికి గురైనా కోపం తెచ్చుకోకుండా వారికి అర్థమయ్యే రీతిలో సర్దిచెప్పేందుకు ప్రయత్నించాలి.



చెరువుల్లో ప్రమాదాలు..

ఎండల్లో నీరు కనిపిస్తే ఎవరికైనా కొంతసేపు సేదతీరాలనిపిస్తుంది. అవగాహన ఉన్నవారైతే చెరువు, కాలువలు ఎంతవరకు శ్రేయస్కరమని ఆలోచించి అందులో దిగుతారు. పిల్లలకు ఆ అవగాహన ఉండదు. చెరువు, కాలువ కనిపిస్తే చాలు ఇట్టే దూకేస్తారు. వాటి లోతు తెలియక ప్రమాదానికి గురవుతుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలా ఇళ్లలో కుటుంబ పోషణ నిమిత్తం భార్యాభర్తలిద్దరూ పనికి వెళుతుంటారు. పిల్లలను ఇళ్ల వద్దనే వదిలి వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. ఆ సమయంలోనే పిల్లలు చెరువులు, కాలువలు, బావుల వద్దకు సరదాగా ఈతకంటూ బయలుదేరతారు. ఒక్కోసారి తెలియకుండానే లోతుకు వెళ్లి శ్వాస అందక ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు కోకొల్లలు. గ్రామీణ ప్రాంత తల్లిదండ్రులు ఈ విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. పనికి వెళ్లే సమయంలో తెలిసిన వారి వద్ద తమ చిన్నారులను ఉంచి వెళ్లడం మంచిది. ఒక వేళ ఈత నేర్చుకోవాలని ఆసక్తి ఉంటే ఎక్కడ సురక్షితమో చెప్పాలి. సంబంధిత నిపుణుడి సమక్షంలో వారికి శిక్షణ ఇప్పించాలి.

● సెల్‌ఫోన్లతో చిక్కులు

వేసవి సెలవుల్లో వీలైనంత వరకూ పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి. ఆన్‌లైన్ తరగతులని.. అదనపు విషయ పరిజ్ఞానం కోసం అంటూ పిల్లల చేతుల్లోకి సెల్‌ఫోన్లు చేరుతున్నాయి. విద్యాపరంగా ఇవి ఎంత ప్రయోజనమో తెలియదు కానీ..అందులో యాప్స్ గురించి మాత్రం అపరిమిత జ్ఞానం సంపాదించేస్తున్నారు. ఫొటో యాప్స్ మొదలు..ఆన్‌లైన్ గేమ్‌ల వరకూ అన్నింటినీ తెలుసుకుంటున్నారు. సోషల్ మీడియాలో ఏకంగా అకౌంట్లు క్రియేట్ చేస్తున్నారు. వారు నేర్చుకునే విషయాలు ఎటువైపునకు దారి తీస్తున్నాయో తల్లిదండ్రులు గ్రహించాలి. ఆన్‌లైన్ గేమ్‌ల్లో బెట్టింగులకు పాల్పడుతున్నారా? అనేది గుర్తించాలి.

తల్లిదండ్రులు ఇలా చేస్తే మేలు..

● వేసవి నేపథ్యంలో వడగాలుల ప్రభావం రోజురోజుకూ ఎక్కువ అవుతోంది. సాధ్య మైనంత వరకూ పిల్లలను ఇంట్లోనే ఉంచేందుకు ప్రయత్నించాలి. లేదంటే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది.

● ఆటలాడుకునే ఆసక్తి ఉన్న పిల్లలను క్యారమ్స్, చెస్ లాంటివి తెచ్చి ఇంట్లోనే ఆడుకునేలా ప్రోత్సహించాలి. చదరంగం వంటి క్రీడలు ఆడటం వల్ల పిల్లల మేధస్సు వికసిస్తుంది. క్యారమ్స్ వల్ల లక్ష్య సాధనపై గురి కుదురుతుంది అనే సత్యాలను పిల్లలకు తెలియజేయాలి.

● విద్యార్థులను గ్రంథాలయాలకు పంపి... పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించాలి. మహనీయుల కథలు, చరిత్ర పుస్తకాలు, బొమ్మల పుస్తకాలు, చందమామ, బాలమిత్ర కథలు వంటివి చదువుకునేలా వారిని సిద్ధం చేయాలి. వాటిలో మంచీ చెడులను, న్యాయాన్యాయాలను, ధర్మాధర్మాల గురించి తెలపాలి. నీతి కథలను చదవించి వాటిలో నీతిని అడిగి తెలుసుకోవాలి.

● ఏ వయస్సు వారికైనా ఉదయం నడక, వ్యాయామం శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. తల్లిదండ్రులు శ్రమ అనుకోకుండా పిల్లలను రోజూ మైదానానికి వెంటబెట్టుకుని తీసుకెళ్లాలి. కొద్దిసేపు నడిపించడం... పరుగెత్తించడం, వారికి నచ్చిన ఆటలు ఆడించడం లాంటివి చేయాలి. అయితే వారిని దగ్గరుండి పర్యవేక్షించాలి.

● స్నేహితుల ఇళ్లకు వెళతామని పిల్లలు మారాం చేయడం సహజం. ఒకవేళ తప్పదనుకుంటే.. తల్లిదండ్రులే వారిని వెంటబెట్టుకుని వెళ్లి వారి స్నేహితుల ఇళ్లలో దిగబెట్టి రావాలి. అంతేకాకుండా ఆ ఇంట్లో పెద్ద వారికి తగిన జాగ్రత్తలు చెప్పడం వల్ల వారు పిల్లలపై ఓ కన్నేసి ఉండేందుకు అవకాశం ఉంది.

జాగ్రత్తలు తప్పనిసరి..

పిల్లల విషయంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా మూల్యం చెల్లించక తప్పదు. కొంతమంది తాతగారి ఇళ్లకు వెళతుంటారు. ఆ సమయంలో కొత్త ప్రదేశం అన్న అవగాహన ఉండదు. ఆపై వాహనాల విషయంలో పిల్లలకు స్వేచ్ఛనిస్తే ప్రమాదాలను ఆహ్వానించినట్టే. అందుకే పిల్లలకు, మైనర్లకు వీలైనంత వరకూ వాహనాలకు దూరంగా ఉంచాలి. కారు పార్కింగ్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. పిల్లల చేతిలో కారు తాళాలు పెట్టకూడదు. వారిని సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచితే చాలా మంచిది.

-సీహెచ్ ఉపేంద్ర, సీఐ, రాజాం



ధనుస్సును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలిలో శ్రీరాముని ధనుస్సుకు పూజలు



బొబ్బిలి రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో శ్రీరాముని కోసం తయారు చేయించిన ధనుస్సును సీతారామ సేవ ఫౌండేషన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చల్లా శ్రీనివాసశాస్త్రి ఆధ్వర్యంలో బొబ్బిలి పట్టణానికి చేరుకుంది. స్థానిక కళింగ వైశ్యభవనం వద్ద గల రామమందిరం వద్ద దీనిని ఉంచారు. మున్నూరు శ్రీనివాసశాస్త్రి ఆధ్వర్యంలో ఆలయంలో పూజలు చేయించి... అనంతరం ప్రజల దర్శనార్థం ఉంచారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులుల మాట్లాడుతూ కిలో బంగారం, 13 కిలోల వెండితో ఈ ధనుస్సు తయారు చేశారని తెలిపారు. శ్రీరాముడు 14 ఏళ్ల వనవాసానికి ప్రతీకగా 14 కిలోల బరువుతో రూపొందించినట్లు ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే బేబీనాయన, మున్సిపల్ చైర్మన్ శరత్‌బాబు, తదితర నాయకులు, కార్యకర్తలు ఈ ధనుస్సును దర్శించుకున్నారు. పట్టణ టీడీపీ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, రౌతు రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

● పార్వతీపురం టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): అయోధ్య శ్రీరాముని ధనుస్సు సోమవారం పార్వతీపురం పట్టణానికి చేరుకుంది. దీనికి తెలుగుదేశం నాయకులు మజ్జి కృష్ణమోహన్ బ్రదర్స్, హిందూ ధర్మరక్షణ పరిషత్ సభ్యులు ఘన స్వాగతం పలికారు. స్థానిక శ్రీ సీతారామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం భక్తుల దర్శనార్థం ఉంచారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు వదిలేస్తున్నారు!

- పీజీఆర్ఎస్‌లో 70 శాతం భూ సమస్యలే
- పరిష్కారంలో జాప్యం ● అర్జీదారుల ఆందోళన

విజయనగరం కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): భోగాపురం పరిధిలో గల సర్వే నెంబరు 344లో 47 సెంట్లు భూమిని 1982లో దగ్గాపు దానప్పలు కొనుగోలు చేసుకున్నారు. 2016 నవంబరు 11న అనారోగ్యంతో ఆయన కన్నుమూశాడు. తరువాత ఆ భూమిని 2017లో దానప్పలు భార్య సూరమ్మ పేరున మ్యుటేషన్ పెట్టి.. మార్పు చేయాలని అధికారులకు విన్నవించుకుంది. సంబంధిత భూమిని వేరే వ్యక్తి పేరున రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో మార్పు చేసినట్లు సూరమ్మ ఫిర్యాదు చేసింది. గత ప్రభుత్వ హయాంలో న్యాయం జరగలేదని.. ఈ ప్రభుత్వమైనా న్యాయం చేయాలని సోమవారం కలెక్టర్‌ను 'మీకోసం' కార్యక్రమంలో విన్నవించుకుంది. ఆన్‌లైన్‌లో తప్పుగా మార్పు చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని సూరమ్మ వేడుకుంది.

వారసత్వంగా వచ్చిన భూమిని ఆక్రమిస్తున్నారు..

'మాకు వారస్వతంగా వచ్చిన భూమిని వేరే వ్యక్తులు ఆక్రమిస్తున్నారు. తాతల కాలం నుంచి భూమిలో వరి సాగు చేస్తున్నాం. ఆన్‌లైన్‌లో మార్పు చేయడానికి కూడా చర్యలు చేపడుతున్నారు. దీనిపై తహసీల్దార్‌కు కూడా ఫిర్యాదు చేశాం. అక్కడ పరిష్కారం కావడం లేదు. వెంటనే చర్యలు తీసుకోవాల'ని వంగర మండలం జగన్నాథవలస గ్రామానికి చెందిన చంద్రకళ, మీనాక్షి, నిర్మల అనే రైతులు సోమవారం కలెక్టర్‌కు మొర పెట్టుకున్నారు.

...ఇలా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి నిత్యం భూ సమస్యలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. భూములు రీసర్వే నిర్వహిస్తున్నా... అధికారులు అర్జీలు స్వీకరిస్తున్నా.. సమస్యలకు చెక్ పడటం లేదు. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరగక తప్పడం లేదు.



భోగాపురం రైతులు

అధిక శాతం అవే...

ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ (మీకోసం)లో భూ సమస్యలపై రైతులు అధికంగా విన్నవించుకుంటున్నారు. మొత్తం వస్తున్న వినతుల్లో 70 నుంచి 75 శాతం వరకూ భూ సమస్యలే ఉంటున్నాయి. భూముల రీసర్వే ద్వారా వినతులు తగ్గాయని అధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయికి వచ్చేసరికి యధావిధిగా వినతులు కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా భూముల రీసర్వేపై సుమారు 20 వేల వినతులు వచ్చాయి. వీటిలో చాలా వరకూ పరిష్కారం కాలేదు. దీంతో చాలా ఇబ్బంది పడుతున్నారు. రీ సర్వే వల్ల సమస్యలు పెరిగాయి తప్ప... తగ్గలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు చుట్టూ తిరుగుతున్నా సమస్యలకు దారి దొరకలేదు. కొన్ని చోట్ల పరిష్కరించాలిసన సమస్యలను కొందరు అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. భర్త నుంచి వచ్చిన ఆస్తిని భార్య పేరు మీద మార్పు చేయలన్నా అనేక కండీషన్లు పెట్టడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో నెల రోజుల వ్యవధిలో ఇద్దరు గ్రామ రెవెన్యూ అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సంగతి తెలిసిందే. దీనిని బట్టి ఆ శాఖలోని కొందరి పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి..రెవెన్యూ శాఖలో జరుగుతున్న జాప్యంపై దృష్టి పెట్టాలని..తమ సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.



వంగర రైతుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

ఇవి కాటేస్తే ప్రమాదమే

- జంతువులు, కీటకాలతో జాగ్రత్త ● బయటకు వెళితే అప్రమత్తత అవసరం
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో మందులు

గజపతినగరం, మే 19 (ఆంధ్రజ్యోతి)

పాము.. తేలు.. శునకం...వీటి కాటుకు గురైన వారి గురించి రోజూ ఎక్కడో ఓ చోట వింటూనే ఉంటాం. వీటి కాటును తేలిగ్గా తీసుకుంటే.. ప్రాణాలకే ప్రమాదం. కొన్ని వెంటనే ప్రాణాపాయం కలిగిస్తే... మరికొన్ని కొద్ది రోజుల తర్వాత ప్రాణాల మీదకు తెస్తాయి. ఇక దోమల సంగతి చెప్పక్కరలేదు. చూడడానికి చిన్నదిగా కనిపించినా..ఇది చేసే చేటు మామూలుగా ఉండదు.



● పాము కాటు వేస్తే..

అన్ని పాములూ విషపూరితమైనవి కావు. విష సర్పం కాటు వేస్తే శరీరంపై కాటు గుర్తులు పడతాయి. అక్కడ వాపు లేదా రక్తస్రావం జరగవచ్చు. విషం శరీరంలోకి మెల్లగా పాకే అవకాశం ఉంటుంది. ఆ తరువాత శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వస్తాయి. వికారం, వాంతులు, తలనొప్పి, అస్పష్టమైన దృష్టి, కండరాల బలహీనత వంటివి జరిగే అవకాశం ఉంటుంది. పాము కాటు వేసిన ప్రాంతాన్ని కడగకూడదు. రక్త స్రావాన్ని ఆపడానికి కట్టు కట్టడం వంటివి చేయకూడదు. విషం పీల్చడానికి ప్రయత్నించకూడదు. బాధితులకు ఆందోళన కలగనివ్వకూడదు. మూఢ నమ్మకాలతో మంత్రాలు వేయకూడదు. వెంటనే దగ్గరలో ఉన్న ఆస్పత్రికి లేదా అర్హుడైన వైద్యుడి వద్దకు తీసుకువెళ్లాలి. వీలైతే కాటు వేసిన పాము జాతి లేదా ఏ రంగులో ఉందో వైద్యులకు తెలియజేయాలి. వైద్య పరీక్షల అనంతరం పాము విషాన్ని బట్టి అక్కడి వైద్యులు యాంటీస్నేక్ వీనం (ఏఎస్‌వీ) ఇస్తారు.

● పొలాల్లో జాగ్రత్త..

వేసవి కాలమైనా ప్రస్తుతం వర్షాలు అధికంగా కురుస్తున్నాయి. పొలాల్లో రైతులు, రైతుకూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో అప్రమత్తంగా లేనివారు పాము కాట్లతో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతంలో పాత నివాస గృహాలు, అపరిశుభ్ర పరిసరాల్లో పాము కాటుకు గురయ్యే ప్రమాదం ఉంది. పాములు రెండు రకాలుగా ఉంటాయి. మొదటిది న్యూరోటాక్సిల్ రకం. నాగుపాము, కట్లపాము, రెండో రకం హోమోటాక్సిన్ అంటే రక్తపింజరి వంటివి. న్యూరోటాక్సిల్‌తో నోటి ద్వారా నురగ వచ్చి శ్వాస అందక మృతి చెందే ప్రమాదం ఉంది. ఇది గుండెపై ప్రభావం చూపి నాడీ వ్యవస్థను దెబ్బతీస్తుంది. రెండో రకానివి కాటు వేస్తే క్షణాల్లో కణజాలం నశించి కాటు పడిన భాగంలో వాపు వస్తుంది. ఎలాంటి పాము అనేది తెలుసుకుంటే చికిత్స చాలా సులభంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. పక్క పక్కనే రెండు దంతాల కాట్లు కనిపిస్తే అది కచ్చితంగా విషపురుగే అని గుర్తించాలి. తక్షణమే అందుబాటులో గల ఆసుపత్రికి తీసుకువెళ్లాలి.

● కుక్క కాటుకు..

ప్రమాదవశాత్తూ కుక్క కరిస్తే అది పెంపుడు శునకమైనా అశ్రద్ధ చేయకూడదు. కుక్క కాటుకు గురైన తక్షణమే దగ్గరలో గల ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలి. అక్కడ ప్రాథమిక చికిత్స చేస్తారు. అనంతరం నాలుగు దఫాలుగా యాంటీ రేబీస్ (ఏఆర్‌వీ) వ్యాక్సిన్ క్రమం తప్పకుండా వేసుకోవాలి. కొన్ని రకాల ఆహారాలు తీసుకొనే విషయంలో జాగ్రత్తలు పాటించాలి. నిర్లక్ష్యం చేసి... వ్యాక్సిన్ వేయించుకోకుండా ఉంటే రేబిస్ బారిన పడి... మరణించే అవకాశం ఉంది.

● దోమలూ ప్రమాదమే..

చూడడానికి చిన్న జీవిగా కనిపించినా... అత్యంత ప్రమాదకారి దోమ. వానా కాలం, శీతాకాలంలో ఇవి ఎక్కువగా వృద్ధి చెంది... డెంగీ, మలేరియా, ఫైలేరి యా తదితర వ్యాధుల వ్యాప్తికి కారణమవు తున్నాయి. వాటిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాల మీదకు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.







● తేలు కరిస్తే...

మన ఇళ్ల పరిసరాలు.. తోటలు, పొలాల్లో తిరిగే మరో విషజంతువు తేలు. చిన్న తేలు వల్ల పెద్దగా ప్రమాదం ఉండదు. అదే పెద్ద తేలు కుడితే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలో ఉన్న వైద్యుడిని లేదా ఆస్పత్రిని సంప్రదించాలి. ప్రాథమిక చికిత్సతో బాధ తగ్గకపోతే పూర్తిస్థాయిలో చికిత్స చేయాల్సి ఉంటుంది.

ధైర్యమే రక్ష..

సాధ్యమైనంత వరకు పాములు, విషకీటకాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రాత్రి పూట పొలాలకు వెళ్లేవారు కర్రలు, టార్చిలైట్లు తీసుకువెళ్లాలి. ఇళ్ల ఆవరణల్లో ముళ్ల పొదలు, రంధ్రాలు, పిచ్చిమొక్కలు లేకుండా చూడాలి. ఒకవేళ పాముకాటుకు గురైతే ఆందోళన చెందకూడదు. అది గుండెపోటుకు దారి తీస్తుంది. తక్షణమే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించాలి. పాముకాటుకు గురైన వారు భయాందోళనకు గురైతే ప్రాణాలు కోల్పోయే అవకాశాలు ఎక్కువ. అటువంటి వారికి ధైర్యం కల్పించి.. ఆసుపత్రికి తీసుకువెళ్లాలి. ఇలా చేస్తే 99శాతం బతికే అవకాశం ఉంటుంది. ఏటా పాము కాటుకు గురవుతున్న వారిలో అత్యధికులు గ్రామీణులేనని వైద్యులు చెబుతున్నారు.

మందులు ఉన్నాయి..

పాము కాటుకు సంబంధించిన మందులు ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. పాము కాటుకు గురైన వారు తక్షణమే ఆసుపత్రికి తీసుకువచ్చి (యాంటీ స్నేక్ వీనం) ఇంజక్షన్ వేయించుకోవాలి. మూఢనమ్మకాలతో మంత్రాలు, నాటు వైద్యాన్ని ఆశ్రయించకూడదు. సమీపంలో గల ఆస్పత్రులకు తీసుకువెళ్లి వైద్యం చేయించుకోవాలి. విష కీటకాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

-అనూజ్‌రాయ్,
పీహెచ్‌సీ వైద్యాధికారి, మరుపల్లి


జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న సర్వీస్ రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

ఆదమరిస్తే ప్రమాదం సుమా..!

● ఆందోళన చెందుతున్న వాహనచోదకులు ● నారుపేట వద్ద జాతీయ రహదారిపై ఏర్పడిన గొయ్యి

భోగాపురం,మే19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారుపేట సమీప జాతీయరహదారిపై ఏర్పడిన గొయ్యి వద్ద ఏపాటి ఆదమరిచినా ప్రమాదం పొంచి ఉందని వాహనచోదకులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇక్కడ పెద్ద గొయ్యి రెండు నెలల కిందట ఏర్పడడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు చెబుతున్నారు. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్లే సర్వీసు మార్గంలో ఉన్న ఈ గొయ్యికి ఆను కుని రోజుకు ఐదువేల వరకు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీనికితోడు భోగాపురం, నవరవిల్లి, అక్కివరం, రాయవరం తదితర చుట్టుపక్కల గ్రామల ప్రజలు, ప్యాసింజర్ బస్సులు సర్వీసు రోడ్డు గుండానే వెళ్తున్నాయి. చీకటిపడిన తర్వాత ఏపాటి ఏమరపాటున ఉన్నా గొయ్యిలోకి వాహనం దూసుకువెళ్తే ప్రమాదముందని చోదకులు చెబుతున్నారు. తక్షణమే విశాఖపట్నంలోని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు స్పందించి గొయ్యి పూడ్చాలని పలువురు వాహనచోదకులు, ప్రయాణికులు కోరతున్నారు.

నేడు మినీ మహానాడు

రాజాం, మే 19 (ఆంధ్రజ్యోతి): శ్యాంపురం టీడీపీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించే మినీ మహానాడును విజయవంతంచేయాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఒక ప్రకటనలో సోమవారం కోరారు. గ్రామ స్థాయి నుంచి సమస్యలపై చర్చించి వాటిపై ఈనెల 27, 28, 29 తేదీల్లో కడపలో నిర్వహించే మహానాడులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నియోజకవర్గ సమస్యలను వివరిస్తామని పేర్కొన్నారు.

నేడు ఎల్.కోటలో..

శృంగవరపుకోట/లక్కవరపుకోట మే 19 (ఆంధ్రజ్యోతి) లక్కవరపుకోటలో మంగళవారం ఎస్.కోటనియోజకవర్గ టీడీపీ మినీ మహానాడు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి సుధారాణి, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రామప్రసాద్ హాజరుకానున్నారని పేర్కొన్నారు.

నేడు వేలంపాట

పూసపాటిరేగ, మే19(ఆంధ్రజ్యోతి): మండలంలో బత్తివలసలో గల 28.15 ఎకరాల్లో ప్రభుత్వభూమిలో గల మామిడి, జీడిమామిడి పంటలు గల ఫలసాయాన్ని మంగళవారం వేలం వేయనున్నట్లు తహసీల్దార్ గోవింద్ తెలిపారు. ఆసక్తిగల వారు పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డెంకాడ, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొదవలస, గొండయ్యపాలెం, జరజాపు కళ్లాలు, బంగార్రాజుపేట, కొండరాజుపేట, చినవల్లూరు, పెదపోలిపల్లి, మహారాజుపేట, రాజపులోవ, చెరకుపల్లిల్లో బుధవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ ఈఈ జి.సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌లైన్ పనుల దృష్ట్యా సరఫరాకు అంతరాయం కలగనుండడంతో వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సెలవులో డీఆర్వో

విజయనగరం కలెక్టరేట్ మే 19 (ఆంధ్రజ్యోతి) డీఆర్వో శ్రీనివాస్ మూర్తి నెల రోజులపాటు సెలవులో వెళ్లారు. ఆయన కుమారుడు ఇంటర్న్‌షిప్ కోసం సెలవు పెట్టినట్లు అధికారులు చెబుతున్నారు. కాని ఇటీవల నిర్వహించిన సమీక్షలో డీఆర్వోపై కలెక్టరు అంబేడ్కర్ అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈనేపథ్యంలో ఆయన మనస్తాపానికి గురై నెల రోజుల పాటు సెలవులు పెట్టినట్లు కలెక్టరేట్ అధికారులు చర్చించుకుంటున్నారు.

ఈఏపీసెట్ ప్రారంభం

విజయనగరం కలెక్టరేట్ మే 19 (ఆంధ్రజ్యోతి) ఇంజనీరింగ్, వ్యవసాయం, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం పరీక్ష (ఈఏపీసెట్) సోమవారం ప్రారంభమయ్యింది. ఉదయం 9 నుంచి 12 గంటల, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకూ పరీక్ష జరిగింది.జిల్లాలోని ఐదు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు తొలిరోజు 2,160 మంది హాజరు కావల్సి ఉండగా 2009 మంది మాత్రమే రాశారు. 153 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. విజయనగరంలోని గాజులరేగలో ఉన్న సత్య ఇంజనీరింగ్ కళాశాల, ఎంవీజీఆర్‌లెండి, అవంతి, జీఎంఆర్ కళాశాలల్లో పరీక్ష నిర్వహించారు.

●రాజాం రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి):రాజాంలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశ పరీక్ష (ఈఏపీసెట్) సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఆరు రోజుల పాటు జరగనున్న పరీక్షల్లో భాగంగా తొలిరోజు రెండుదశల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం నిర్వహించే పరీక్షలకు 281 మంది కి గాను 259 మంది, రెండోపూట 281 మందికి గాను 265 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఉదయం నిర్వహించే పరీక్షలకు 22 మంది, రెండోపూట నిర్వహించే పరీక్షలకు 16 మంది విద్యార్థులు హాజరుకాలేదు.

ఎస్‌డబ్ల్యూపీసీలు వినియోగంలోకి తీసుకురావాలి

గజపతినగరం మే19 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లోని చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురాకపోతే అధికారులపై చర్యలు తప్పవని ఈవోపీఆర్డీ సుగుణాకరరావు హెచ్చరించారు. ఆదివారం వినియోగించరా.. లక్ష్యానికి దూరంగా చెత్తసంపద కేంద్రాలు శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో స్పందించారు. ఈ మేరకు మండలంలోని అన్ని పంచాయతీలో గల చెత్త సంపద కేం ద్రాలనుసోమవారం పరిశీలించారు. లింగాలవలసలో రోడ్డుపైన వేసిన చెత్తను కేంద్రానికి తరలించేందుకు చర్యలు తీసుకున్నారు.

అర్జీలు రాయడానికి సిబ్బంది నియామకం

●సెలవులకోసం మెసెజ్ పెడితే షోకాజ్ నోటీసులు: కలెక్టరు అంబేడ్కర్


అర్జీదారులతో మాట్లాడుతున్న అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే నిరాక్షరాస్యుల అర్జీలను రాయడంలో సహకరించడానికి కలెక్టరేట్ నుంచి ఇద్దరు సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టరు అంబేడ్కర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వివిధ సమస్యలపై 154 వినతులు వచ్చాయి. వీటిని కలెక్టరు అంబేడ్కర్, ఇన్‌చార్జీ డీఆర్వో మురళి, డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, నూకరాజు, ప్రమీల గాంధీలు స్వీకరించారు. వినతుల్లో 116 రెవెన్యూకు సందించినవి కావడం విశేషం. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ నిరక్ష్యరాసులైన వారు తమ అర్జీరాయడానికి దళారులను ఆశ్రయిస్తున్నారని, దీంతో వారు అర్జీదారులను మభ్య పెట్టి వారి నుంచి డబ్బులు తీసుకుని ప్రతి సోమవారం కలెక్టరేట్ చుట్టు తిరిగేలా చేస్తున్నారని చెప్పారు. మండల, డివిజన్ స్థాయిలో పరిష్కారం కాకపోతే జిల్లా కేంద్రానికి రావాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్ జిల్లా అధికారులు రావాలని ఆదేశించారు. సెలవుల కోసం సెల్ ఫోన్‌లో మెసెజ్ పెట్టేవారికి షోకాజ్ నోటీసులు ఇస్తామని తెలిపారు.

ఆధార్,రేషన్ కార్డు మంజూరు చేయాలి

కిడ్నీసమస్యలతో బాధపడుతుండడంతో డయాలసిస్ కోసం డాక్టర్లు రేషన్, ఆధార్ కార్డులు అడుగుతుండడంతో వాటిని మంజూరు చేసి ఆదుకోవాలని కలెక్టరు అంబేడ్కర్‌ను గరివిడి గ్రామానికి చెందిన బలివాడ వెంకట సత్య సాయి మదుకుమార్ గ్రీవెన్స్‌లో కోరారు. ఈ మేరకు స్పందించిన కలెక్టరు వెంటనే డీఎస్‌వో మదుసూదనరావు, సచివాలయం కోఆర్డినేటర్‌ను పిలిచి వారితో మాట్లాడి వెంటనే రెండు కార్డులు మంజూరుచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే విజయనగరంలోని ఆనంద నగర్ చెందిన శ్రీనిధిఐశ్వర్య పించన్‌కు మంజూరుచేయాలని తండ్రి బహ్మజీ పీజీఆర్ఎస్‌లో వినతి అందజేశారు. సదరం ధ్రువ పత్రం కూడా ఉందని వెంటనే పింఛన్ మంజూరు చేయాలని కోరారు.

డిసెంబరులో గానుగ ప్రారంభం

జిల్లాలోని సంకలి చెక్కర కర్మాగారాన్ని మూసివేసే ప్రసక్తే లేదని కలెక్టరు అంబేడ్కర్ చెప్పారు. సంకిలిలోని ఫ్యాక్టరీ చెక్కర కర్మాగారం మనుగుడు తదితర అంశాలపై క్యాంపుకార్యాలయంలో సోమవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ చెక్కర కర్మాగారంలో డిసెంబరులో చెరకు గానుగ ప్రారంభమై మార్చివరకూ జరుగుతుందని చెప్పారు. ప్రసుత్తం చెరుకు సాగు ప్రకారం 2 లక్షలు నుంచి 2.5 లక్షలు టన్నుల వరకూ క్రసింగ్ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే ఏడాది సీజన్‌కు కనీసం 5 లక్షలు టన్నుల చెరుకు పండించే విధంగా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. కాగా జూన్ 21న యోగాడే కార్యక్రమాన్ని భారీఎత్తున నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టరు ఆదేశించారు.

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

●శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి


శృంగవరపుకోట: మాట్లాడుతున్న కోళ్ల లలితకుమారి

శృంగవరపుకోట, మే 19(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా నిలదోక్కుకోవాలని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి కోరారు, సోమవారం ఎస్.కోట శ్రీనివాస కాలనీ సామాజిక భవనంలో ఉచిత టైలరింగ్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడ్తుతూ టైలరింగ్ శిక్షణ ద్వారా మెలకవలు నేర్చుకొని కుటుంబాలకు ఆర్థికంగా తోట్పాటు ఇవ్వాలని మహిళలకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండలా ధ్యక్షుడు జీఎస్‌నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, పార్టీ పట్టణాధ్యక్షుడు కొనదం మల్లేశ్వరరావు, నాయకులు కాపుగంటి వాసు, చక్కా కిరణ్, పెదగాడి రాజు, అనకాపల్లి చెల్లయ్య పాల్గొన్నారు.

● లక్కవరపుకోట, మే 19(ఆంధ్రజ్యోతి): మహిళలు కుట్టు మిషన్ల శిక్షణను వినియోగించుకొని స్వశక్తితో బతకాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పిలుపునిచ్చారు. లక్కవరపుకోటలో ప్రభుత్వం మంజూరు చేసిన కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కెర్రు పార్వతి, టీడీపీ నేతలు చొక్కాకుల మల్లునాయుడు, కొల్లు రమణమూర్తి పాల్గొన్నారు.

దుకాణాలు కొనసాగించాలి


కలిశెట్టి అప్పలనాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారులు

గరివిడి, మే 19(ఆంధ్రజ్యోతి): గరివిడి రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే బ్రిడ్జి దగ్గరలో దుకాణాలు ఖాళీచేయించకుండా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరారు.ఈ మేరకు తమ సమస్యను పరిష్కరించాలని సోమవారం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావులకు పట్టణ టీడీపీ నేతలు వర్మరాజు, టి.శ్రీను, చిన్నా, దివాకర్, నరసింగరావు తదితరుల ఆధ్వర్యంలో వ్యాపారులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా గరివిడి రైల్వే బ్రిడ్జి సమీపంలో 30 సంవత్సరాలుగా రైల్వే జాగాలో షాపులు ఏర్పాటు చేసుకొని వివిధ రకాల వ్యాపారాలు చేస్తున్నామని తెలిపారు. దీనికి సంబంధించి 2023 వరకు రైల్వే శాఖ వారికి అద్దెలు, శిస్తులు కూడా చెల్లిస్తున్నామని చెప్పారు. పదిరోజుల కిందట రైల్వే అధికారులు షాపులను ఖాళీ చేయాలని నోటీసులిచ్చారని తెలిపారు. దీంతో 30 షాపుల్లో వ్యాపారాలు చేస్తున్న వందమంది వరకు అనాథలవుతామని పేర్కొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించండి

గజపతినగరం, మే19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు మౌలిక వసతులపై నిర్లక్ష్యం చేయవద్దని స్థానిక న్యాయాధికారి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ కోరారు. సోమవారం గజపతినగరం దిగువ వీధిలోగల ఎస్సీ బాలికల, బీసీ బాలుర వసతి గృహాలు, బాలసదనంతో పాటుపలు వసతిగృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రతి రోజూ అమలు చేస్తున్న మెనూ, మౌలిక వసతులపై ఆరాతీశారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

వేపాడ, మే 19 (ఆంధ్రజ్యోతి):మండలంలోని బొద్దాంలో పది కుటుంబాలకు ఇళ్ల స్థలాలు మంజూరుచేయాలని మాదిగ పోరాట సమితి మండల నాయకులు కణితి సోమనాధం కోరారు.ఈ మేరకు సోమవారం విజయనగరంలోని కలెక్టర్ గ్రీవెన్స్‌లో జేసీకి వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన సర్వే నెంబరు 105/2లో మెట్ట పోరంబోకు భూమిలో ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరారు.

కార్మికులకు న్యాయం చేయాలి

జామి, మే 19 (ఆంధ్రజ్యోతి): భీమసింగి చక్కెర కర్మాగారం విషయంలో ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, సుగర్స్ కార్మికులకు న్యాయంచేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు.సోమవారం భీమసింగిసుగర్స్‌కార్మికులు పీఎఫ్,గ్రాట్యూటీ యాజమాన్యం చెల్లించలేదని చేసిన నిరసనతెలిపారు. ఈసందర్భంగా బాబ్జీమాట్లాడుతూఫ్యాక్టరీ మూతతో కార్మికులు బతుకులు రోడ్డున పడ్డాయని ఆందోళన వ్యక్తంచేశారు.గత ప్రభుత్వం మతిలేని చర్యవల్లవేలాదిమంది రైతులు, వందలమంది కార్మికుల జీవితాలు నాశనమయ్యాయమన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నేతలు శ్రీను, కనకరాజు, కృష్ణ, దేవుడు, వెంకటరావు, అబ్బాస్, వర్మ, ఎర్నాయుడు, ఆదిబాబు, మధు, సత్తిబాబు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలు పరిష్కరించాలి: ఏఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

విజయనగరం క్రైం,మే19 (ఆంధ్రజ్యోతి):జిల్లాలోని పోలీసుస్టేషన్ల పరిధిలో బాధితుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ పి. సౌమ్యలత అధికారులను ఆదేశించారు. సోమవారం విజయనగరంలోని జిల్లా పోలీసుకార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో 35 ఫిర్యాదులను స్వీకరించా రు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను నివేదిక రూపంలో జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కె చౌదరి, సుధాకర్, ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు.

భూసేకరణ నోటిఫికేషన్ వెనక్కి తీసుకోవాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మారిక గిరిజనులు

వేపాడ,మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకవలస పంచాయతీ శివారు మారిక భూములను అదాని కంపెనీకి అప్పగించేందుకు ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను వెనెక్కితీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ కోరారు.ఈ మేరకు సోమవారం మారిక గ్రామస్థులతో కలిసి ఇన్‌చార్జి తహసీల్దార్ కె.సన్యాసినాయుడుకి వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా గిరిజనులతోపాటు జగన్ మాట్లాడుతూ మారికలో అదాని పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి చేపట్టిన భూసేకరణ సామాజిక అధ్యయనంకోసం కలెక్టర్ ఆదేశాలమేరకు తహసీల్దార్ నోటి ఫికేషన్ జారీచేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడి గిరిజనులు ప్రకృతి,అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం స్పందించి మా భూములను అదాని కంపెనీకి ధారాదత్తం చేయడం విరమించాలని డిమాండ్ చేశారు.

జేజేఎం పథకం పరిశీలన


పోతనాపల్లి సంపు వద్ద పరిశీలిస్తున్న అధికారులు

శృంగవరపుకోట రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతనాపల్లి వద్ద జేజేఎం నిధులతో నిర్మించినపథకం ద్వారా ఎస్.కోటకు నీరు సరఫరాచేసే ప్రాజెక్టును సీఈవో సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత మాట్లాడుతూ గతంలో ఈ సంపు ద్వారా ఎస్.కోటకు నీరు సరఫరా అయ్యేదని, తర్వాత నిలిచిపోయిందని తెలిపారు. అయితే గతంలో మాదిరిగా మామిడిపల్లి గోస్తనీతీరం నుంచి కొత్తగా జేజేఎం నిధులతో పైప్‌లైన్ ఏర్పాటుచేశామని,దీని ద్వారా ఎస్.కోట ప్రాంతానికి తాగునీరందిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఇది ట్రయిల్‌దశలోఉందన్నారు. కార్యక్రమంలో డీపీవో వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

సీతంపేట రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 2025 మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఆదివాసీ బిడ్డలకు ఈ నోటిఫికేషన్‌లో మినహాయింపునిస్తూ గిరిజన యువతీ, యువకుల కోసం ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏజేఏసీ అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు, కార్యదర్శులు ఉమామహేశ్వరరావు, కె.భాస్కరరావులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలు శతశాతం గిరిజన అభ్యర్థులకే కేటాయించాలని కోరారు. ఈ మేరకు ఈనెల 27వ తేదీన శాంతియుత భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ శాంతియుత ర్యాలీలో డీఎస్సీ అభ్యర్థులు, కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు, భాషా వలంటీర్లు, ఉద్యోగ, నిరుద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏజేఏసీ నాయకులు పాల్గొన్నారు.

గిరి వెలుగును కలిపితే ఉద్యమిస్తాం

జియ్యమ్మవలస, మే 19 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరి వెలుగును డీఆర్‌డీఏలో విలీనం చేసే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని, లేదంటే తీవ్రంగా ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.సాంబమూర్తి అన్నారు. సోమవారం ఆయన జియ్యమ్మవలసలో గిరిజన సంఘ నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. గిరి వెలుగు ఐటీడీఏలో ఉంటే గిరిజనులకు కొంత మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. దీనిపై గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి దృష్టి సారించి డీఆర్‌డీఏలో గిరి వెలుగును అనుసంధానం చేసే ఆలోచనను విరమించాలని కోరారు. గత నాలుగున్నర సంవత్సరాలుగా గిరి వెలుగులో ఏపీడీగా పనిచేస్తున్న అధికారిపై వస్తున్న అనేక ఆరోపణలపై పూర్తి దర్యాప్తు చేసి అవినీతిని బయటపెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. 2019లో ధాన్యం కొనుగోలు చేసే సందర్భంగా వచ్చిన కమిషన్లు, 8 మండలాల పరిధిలో 54 వన్‌ధన్ కేంద్రాల నిర్వాకం, తదితర అంశాలపై పూర్తి దర్యాప్తు చేస్తే నిజాలు ఖచ్చితంగా బయటపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు హెచ్.రామారావు పాల్గొన్నారు.

ఆ రెండు వార్డులకు పండుగ లేదు

సాలూరు రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): సాలూరు గ్రామదేవత శ్యామలాంబ పండుగను 14 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్నారు. సాలూరులోని అన్ని వార్డుల ప్రజలూ పండుగలో నిమగ్నమయ్యారు. ఇదిలా ఉండగా మున్సిపాలిటీలోని 3వ వార్డు గుమడాం, 25వ వార్డులో భాగమైన బంగారమ్మపేట, పీఎన్ బొడ్డవలస ప్రజలు మాత్రం శ్యామలాంబ పండుగకు దూరంగా ఉండడం విశేషం. 1950లో ఈ మూడు గ్రామాలు సాలూరు మున్సిపాల్టీలో విలీనం అయ్యాయి. దీంతో సాలూరు 3వ గ్రేడ్ మున్సిపాలిటీగా అవతరించింది. అయితే ఈ మూడు గ్రామాలు భౌతికంగా సాలూరు మున్సిపాలిటీలో ఉన్నప్పటికీ పూర్వపు ఆచారాన్నే కొనసాగిస్తున్నాయి. బంగారమ్మపేట, పీఎన్ బొడ్డవలసవాసులు కుండల పోలమ్మను గ్రామదేవతగా కొలుస్తూ పండగను నిర్వహిస్తుంటారు. గుమడాం వాసులు పైడితల్లమ్మ, బంగారమ్మలను గ్రామదేవతలుగా పండగను చేస్తున్నారు. అయితే సాలూరు సమీపంలో ఉన్న దుగ్గసాగరం మాత్రం మున్సిపాలిటీలో భాగం కాకపోయిన శ్యామలాంబ పండుగను ఆచరిస్తోంది.

ఉపాధి కూలీ మృతి


సరోజనమ్మ (ఫైల్)

పాలకొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): వెలగవాడ పంచాయతీ సిరికొండ గ్రామానికి చెందిన పాలక సరోజనమ్మ(54) ఉపాధి పని చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సరోజనమ్మ సోమవారం ఉదయం సిరికొండ సమీపంలో ఉన్న ఊర చెరువుకు తోటి వేతనదారులతో పనికి వెళ్లింది. పనుల్లో నిమగ్నమై ఉండగానే సరోజనమ్మ వాంతులు చేసుకొని ఒక్కసారిగా కుప్పకూలింది. తోటి వేతనదారులు ఆమె పరిస్థితిని గమనించి సపర్యలు చేశారు. 108కు సమాచారం అందించి పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్ప టికే సరోజనమ్మ మృత్యువాతపడినట్టు వైద్యులు నిర్ధారించారు. అందరితో సరదాగా ఉపాధి పనులకు వచ్చిన సరోజనమ్మ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు,వేతనదారులు కన్నీరుమున్నీరయ్యారు. ఈమెకు భర్త పెంటయ్య, కుమారుడు నారాయణరావు ఉన్నారు. సరోజనమ్మ మృతితో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

శివరాంలో యువకుడు ఆత్మహత్య

గరివిడి, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివరాం గ్రామానికి చెందిన కుమిలి భాస్కరరావు (27) సోమవారం తెల్లవారుజామున ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. భాస్కరరావు మూడు నెలల కిందట విశాఖలో రైల్వే కాంట్రాక్టర్ దగ్గర ఉద్యోగంలో చేరాడు. కొంతకాలంగా గ్రామంలో పరిచయస్థులు, బంధువుల వద్ద అప్పులుచేశాడు. ఇటీవల అప్పులు చెల్లించాలని అడుగుతుండడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరిపోసుకున్నాడు.భాస్కరరావు ఆన్‌లైన్ గేమ్‌లు, బెట్టింగ్‌లకు అలవాటు పడినట్లు సమాచారం. ఆయనకు అన్నయ్యతోపాటు తండ్రి మోహన్‌రావు, తల్లి సత్యవతి ఉన్నారు.ఈ మేరకు గరివిడి ఎస్ఐ లోకేశ్వరరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూతురే హంతకురాలు

శృంగవరపుకోట రూరల్, మే19 (ఆంధ్రజ్యోతి):మండలంలోని వెంకటరమణపేట వద్ద సంచలనం సృష్టించిన వివాహితహత్యకేసును పోలీసులు చేధించారు. కూతురే హంతకురాలిగా గుర్తించారు. సోమవారంరాత్రి సీఐ నారాయణమూర్తి వివరాలు వెల్లడించారు. సీఐ కథనం మేరకు.. వెంకటరమణపేటలో రెండురోజుల కిందట వివాహిత ఎర్రాప్రగడ వెంకట లక్ష్మి హత్యకు గురైంది. ఈ కేసులో దర్యాప్తుచేపట్టిన పోలీసులు వెంకటలక్ష్మిని కుమార్తె హత్య చేసినట్లు గుర్తించారు.ఆబాలిక తనస్నేహితులతో ముందుగా వేసుకున్న ప్రణాళికప్రకారం వెంకటలక్ష్మిని బయటకు తీసుకెళ్లి హత్య చేసింది.అనంతరం గ్రామసమీపంలోగల అవాల బావిలోపడేసింది. ఈ కేసులో బాలికను అరెస్ట్‌చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా వారి ఆదేశాల మేరకు జువైనైల్ హోంకు తరలించారు. హత్యకు సహకరించిన ఆమె స్నేహితులు ఇద్దరు పరారీలో ఉన్నారు. వీరికోసం పోలీసులు గాలిస్తున్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

భోగాపురం, మే19(ఆంధ్రజ్యోతి):విశాఖ జిల్లా గాజువాకకు చెందిన లారీ క్లీనర్ ఈశ్వరరావు అదృశ్యమయ్యాడని భార్య లక్ష్మి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసినట్లు భోగాపురం సీఐ దుర్గా ప్రసాద్ తెలిపారు. సీఐ కథనం మేరకు.. లారీ తీసుకొని డ్రైవర్, క్లీనర్ ఈశ్వరరావు ఒడిశా వెళ్లి తిరిగి విశాఖ వస్తున్నారు. ఈనెల 14వ తేదీ రాత్రి సమయంలో డ్రైవర్ అలిసిపోవడం వల్ల భోగాపురం మండలంలోని సుందరపేట పెట్రోల్ బంకు సమీపంలో లారీ నిలిపివేశాడు. 15వ తేదీ ఉదయం చూడగా ఈశ్వరరావు అదృశ్యమయ్యాడు. అయితే ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఈశ్వరరావు భార్య లక్ష్మి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సంతకవిటి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుళ్లసీతారాంపురం ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు హెచ్‌సీ రామకృష్ణ తెలిపారు. గుళ్లసీతారాంపురానికి చెందిన కొందరు వ్యక్తులు రాజాం నుంచి సంతకవిటి వైపు వస్తున్న లగేజీ వ్యాన్ ఎదురుగా వస్తున్న ఆటోకి వ్యాన్ వెనుక భాగం ఢీకొందని చెప్పారు. దీంతో గుండెల దీపిక, డోకు దేవిలకు గాయాలు కావడంతో రాజాంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. సోమవారం డోకుదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు చెప్పారు.

35 మద్యం సీసాలు స్వాధీనం

మెంటాడ, మే19 (ఆంధ్రజ్యోతి):అక్రమంగా తరలిస్తున్న 35 మద్యం సీసాలను ఆండ్ర ఎస్ఐ సీతారాం స్వాధీనం చేసుకున్నారు. లోతుగెడ్డ గ్రామానికి చెందిన కలగర్ల గౌరి సోమవారం వేకువజామున మెంటాడ నుంచి లోతుగెడ్డకు మద్యం సీసాలను ద్విచక్రవాహనంపై తరలిస్తుండగా పిట్టాడ చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ద్విచక్ర వాహనం సీజ్‌చేసి కేసునమోదు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సీతారాం చెప్పారు.

సారా రహిత మండలంగా మెంటాడ: సీఐ

మెంటాడ,మే 19(ఆంధ్రజ్యోతి):నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మెంటాడను సారా రహిత మండలంగా తీర్చిదిద్దినట్లు గజపతినగరం ఎక్సైజ్ సీఐ జనార్దనరావు తెలిపారు. సోమవారం మెంటాడలో ఎంపీడీవో ఎ.భానుమూర్తి, తహసీల్దార్ కె.శ్రీనివాసరావు, మెంటాడ ఎస్ఐ కె.సీతారాంతో కూడిన మండలస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. సి.కేటగిరి గ్రామాలుగా గుర్తించిన ఆండ్ర, లోతుగెడ్డ, గుర్లతమ్మరాజుపేట, పోరాం, వానిజ గ్రామాల్లో సారావల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన సదస్సు నిర్వహించి, స్థానికులను చైతన్య పరచనున్నట్లు సీఐ తెలిపారు. గ్రామ, మండల కమిటీలు నిరంతరం పర్యవేక్షణ వల్ల దోహదపడిందని పే ర్కొన్నారు. మండల కమిటీ ఏకాభిప్రాయంతో అయా గ్రామాలను ఈ నెలలో సారా రహిత గ్రామాలుగా ధ్రువీకరిస్తున్నట్టు ఎక్సైజ్ సీఐ జనార్దనరావు తెలిపారు.

ఆధునికీ'కరుణ' లేకపోయె

(ఐదో పేజీ తరువాయి)

పరిధిలో 12 వేల ఎకరాలకు... పెదంకలాం ప్రాజెక్టు ద్వారా 8,253.47 ఎకరాలకు సాగునీరందేది. ఆధునికీకరణ పూర్తిగా అటకెక్కిపోయింది. ఇప్పుడు ఆ జైకా నిధుల పరిస్థితి ఏమిటో ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి, నీటి పారుదలశాఖకే తెలియాలి.

ఎస్‌డీఎంఎఫ్ పనులూ అంతే..

ప్రాజెక్టుల్లో కాలువల లైనింగ్ పనులు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్ డిజాస్టర్ మిటిగేషన్ ఫండ్ (ఎస్‌డీఎంఎఫ్) నిధులు జిల్లాలో అన్ని ప్రాజెక్టులకు మంజూరు చేస్తూ హైప్రయారిటీ వర్క్స్ చేయాలని నిర్ణీత గడువు కూడా విధించింది. ఈ ఎస్‌డీఎంఎఫ్ నిధుల్లో 90 శాతం కేంద్ర ప్రభుత్వం, 10 శాతం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. జిల్లాలో ఐదు మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఒక మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుకూ ఈ నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సాగునీటి కాలువల్లో ఎక్కడ అత్యవసరం అనుకుంటే అక్కడ ఈ నిధులతో పనులు చేయాల్సి ఉంది.

● తోటపల్లి ఇరిగేషన్ ప్రాజెక్టు పరిధిలో కురుపాం నియోజకవర్గం పరిధిలో రెండు, పార్వతీపురం నియోజకవర్గం పరిధిలో మూడు, విజయనగరం జిల్లా బొబ్బిలి నియోజకవర్గం పరిధిలో మూడు వర్కులు కలిపి 8 వర్కులకు గాను రూ.293.02 లక్షల అంచనా విలువతో నిధులు మంజూరయ్యాయి. ఈ పనులన్నీ కుడి కాలువ పరిధిలో చేయాల్సినవే. వీటిలో రెండు వర్కులు సెప్టెంబరు వరకు గడువు ఉంటే, మిగిలిన ఆరు జూలై నెలకు పూర్తి కావాల్సి ఉంది. కురుపాం నియోజకవర్గం పరిధిలోని రెండు పనులు 30 శాతం పూర్తయ్యాయి. మిగిలిన ఆరు వర్కులు ఇంకా ప్రారంభమే కాలేదు.

● కురుపాం నియోజకవర్గం పరిధిలో ఉన్న ఒట్టిగెడ్డ రిజర్వాయర్‌కు సంబంధించి మూడు పనులు రూ. 12 లక్షలతో మంజూరయ్యాయి. వీటిని మార్చి 2025 చివరి నాటికి పూర్తి చేయాల్సి ఉంది. ఇంకా ప్రారంభమే కాలేదు.

● పాలకొండ నియోజకవర్గం పరిధిలో రూ.30.80 లక్షలతో 8 పనులు మంజూరయ్యాయి. ఇవి కూడా మార్చి 2025 నెలాఖరుకు పూర్తికావాలి. ఇంకా ప్రారంభమే కాలేదు.

● వెంగళరాయసాగర్ ప్రాజెక్టు పరిధిలో రూ.73.9 లక్షలతో 19 పనులు మంజూరయ్యాయి. వీటిని ఏప్రిల్ 16కు పూర్తి చేయాల్సి ఉంది. ఇంకా ప్రారంభం కాలేదు.

● పెద్దగెడ్డ ప్రాజెక్టు పరిధిలో రూ.91 లక్షలతో 15 పనులు మంజూరయ్యాయి. వీటిని కూడా మార్చి నెలాఖరుకే పూర్తి చేయాలి. పనులు జరిగే పరిస్థితి లేదు.

● పెదంకలాం ప్రాజెక్టు పరిధిలో రూ.16 లక్షలతో 9 పనులు మంజూరయ్యాయి. వీటిని మార్చి నెలాఖరులోగా పూర్తిచేయాలి. వీటిలో కొన్ని నత్తనడకన సాగుతున్నాయి.

● ఇక అంతర్ రాష్ట్ర వివాదంతో నలుగుతున్న కొమరాడ మండలంలో ఉన్న జంఝావతి ప్రాజెక్టు పరిధిలో ఎస్‌డీఎంఎఫ్‌తో చంద్రంపేట వద్ద యూటీ మరమ్మతులకు రూ.3.36 లక్షలు మంజూరయ్యాయి. ఈ ఒక్క పని మాత్రమే మరికొద్ది రోజుల్లో పూర్తయ్యేలా కనిపిస్తోంది. ఇప్పటికే ఎర్త్‌వర్క్ పూర్తి చేయించిన ఇంజనీరింగ్ అధికారి మరికొద్ది రోజుల్లో పూర్తి చేస్తామని చెబుతున్నారు. వాస్తవానికి ఈ ఖరీఫ్ సీజన్ నాటికి పూర్తి చేయాల్సి ఉంది.

ఎందుకీ నిర్లక్ష్యం..

ఎస్‌డీఎంఎఫ్ నిధులతో ప్రాజెక్టుల్లో చేపట్టాల్సిన ముఖ్యమైన పనులను గత ఏడాదే ప్రభుత్వం మంజూరు చేసింది. పనుల పూర్తికి నిర్దిష్ట గడువు కూడా విధించింది. టెండర్ పాడుకున్న కాంట్రాక్టర్లతో పనులు చేయించడంలో నీటి పారుదలశాఖ అధికారులు తాత్సారం చూపుతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆధునికీకరణ పరిస్థితి దేవుడెరుక కనీసం ఈ పనులైనా చేస్తే ఖరీఫ్‌కు కొంతమేర సాగునీరందడంలో పరిస్థితి మెరుగ్గా ఉంటుందని వీరు ఆశ పడుతున్నారు.

రాష్ట్రాభివృద్ధే ధ్యేయం: ప్రభుత్వ విప్



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

కురుపాం రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. కురుపాం మండలంలోని గుజ్జువాయి - డేరింగుపాడు గ్రామాల మధ్య రూ.2.8 కోట్ల అంచనాలతో నిర్మించబోయే బీటీ రోడ్డు పనులకు ఆమె సోమవారం భూమిపూజ చేశారు. టీడీపీ నాయకులు కోలా రంజిత్‌కుమార్, కడ్రక కళావతి, సర్పంచ్ నాగేశ్వరరావు, ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి

● ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో చేపట్టే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని పీవో అశుతోష్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయంలో తన చాంబర్‌లో సోమవారం ఆయన డ్వామా సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీలో ఉద్యానవన మొక్కల పెంపకం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా అధిక ఆదాయం లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఏపీడీ సురేష్‌నాయుడు, 8 మండలాల ఏపీవోలు, ఈసీలు, జేఈలు, ఏపీవో మురళీధర్ పాల్గొన్నారు.

కాలువల్లో పూడికలు తొలగించాలి

పాలకొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌రాజుపేటలోని పద్మనాభ చెరువు దిగువన 200 ఎకరాలకు సాగునీరు అందించే పిల్ల కాలువల్లో పూడికలు తొలగించాలని అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు, ఆయకట్టు రైతులు కోరారు. ఈమేరకు సోమవారం స్థానిక ఎంపీడీవో కు వినతిపత్రాన్ని అందించారు. ఖరీఫ్ సమీపిస్తున్న కారణంగా ఉపాధి హామీ పథకం ద్వారా కాలువలో పూడిక తీయించాలని, నాగావళి ప్రధాన ఎడమ కాలువ దిగువ డిస్ట్రిబ్యూటరీ ద్వారా 150 ఎకరాలకు సాగునీరు అందించే కాలువ పూడిక తీయాలని కోరారు.

నాలుగో రోజూ కొనసాగిన రిలే దీక్షలు



రిలే దీక్ష చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

బెలగాం, మే 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ వద్ద ఆంధ్రప్రదేశ్ గిరిజన సలహా మండలి(జేఏసీ) ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు నాలుగు రోజు సోమవారం కూడా కొనసాగాయి. ప్రత్యేక డీఎస్సీ ద్వారా గిరిజన ప్రాంతాల ఉపాధ్యాయ పోస్టులను గిరిజనులతో భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నాయకులు నినాదాలు చేశారు. జీవో నెంబర్-3 స్థానంలో కొత్త చట్టం తీసుకొచ్చి గిరిజనులకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ చైర్మన్ కొండగొర్రె ధర్మారావు, ఏ.నీలకంఠం, సెక్రటరీ కె.జయన్న, వైస్ చైర్మన్‌లు డి.సీతారాం, రామకృష్ణ, చంద్రశేఖర్, మల్లయ్య, గిరిధర్, సాయిబాబా, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు టి.సత్యనారాయణ, సూర్యనారాయణ, డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

● కలెక్టర్ శ్యాంప్రసాద్

● పీజీఆర్‌ఎస్‌కు 108 వినతులు

పార్వతీపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారి నుంచి మొత్తం 108 వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సమస్యను మానవతా దృక్పథంతో పరిశీలించాలన్నారు. పార్వతీపురం పట్టణానికి చెందిన జి.కిషోర్ అనే దివ్యాంగుడు తన తల్లితో కలిసి వినతిపత్రం అందిస్తూ తనకు మూడేళ్ల కిందట పింఛన్ నిలిపివేశారని, పింఛన్ మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



సీతంపేటరూరల్: వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పార్వతీపురం పట్టణం జగన్నాథపురానికి చెందిన యువకులు తమకు గ్రంథాలయంతో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందించాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై కలెక్టర్ స్పందించి యువతకు అవసరమైన పుస్తకాలను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. సాలూరు మండలం గున్న మామిడివలసలో తాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఎం.లోకేష్ వినతిపత్రాన్ని అందించారు. ఈ విధంగా వివిధ సమస్యలపై ప్రజలు వినతిపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో జేసీ శోభిక, సబ్ కలెక్ట ర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో హేమలత, ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ పోస్టింగ్‌పై వినతి

పాలకొండ: అక్రమ అవుట్‌సోర్సింగ్ పోస్టింగ్‌పై పాలకొండ నగర పంచాయతీ పాలకవర్గ సభ్యులు కలెక్టర్ పీజీఆర్‌ఎస్‌లో సోమవారం వినతిపత్రం అందించారు. ఈ అక్రమమైన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం నిలుపుదల చేయాలని కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను కోరారు. అలాగే ఎన్నో ఏళ్లగా పాలకొండ నగర పంచాయతీకి పట్టిపీడిస్తున్న డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరించి, స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్‌కు విన్నవించారు.



పార్వతీపురం: వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

ఐటీడీఏ పీజీఆర్‌ఎస్‌కు 44 వినతులు

సీతంపేట రూరల్: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు మొత్తం 44 వినతులు వచ్చాయి. పుబ్బాడ గ్రామంలో సీసీ రహదారి నిర్మించాలని కె.పద్మ కోరారు. కొత్తూరు మండలం రెల్లిగూడ గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని బంగారమ్మ కోరగా రాజమానుగూడ గ్రామంలో వరదగోడ నిర్మించాలని సవర చిన్నారావు కోరారు. కుంబి గ్రామంలో మంచినీటి బోరు ఏర్పాటు చేయాలని కూరంగి రామారావు, సబ్సిడీపై ట్రాక్టర్ ఇప్పించాలని పకీరు, రాయిమానుగూడ గ్రామంలో సీసీ రహదారి నిర్మించాలని సవర దీపిక, ఉద్యోగవకాశం కల్పించాలని రాజేశ్వరరావు, మెట్టుగూడ గ్రామంలో వీధి కాలువలు నిర్మించాలని ఆరిక సురేష్‌లు పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డిని కోరారు. ఇలా అనేక సమస్యలు పరిష్కారం కోరుతూ పీజీఆర్‌ఎస్‌కు వినతులు వచ్చాయి. పీవోతో పాటు డీడీ అన్నదొర, టీడబ్ల్యూ ఈఈ పి.రమాదేవి, పీహెచ్‌వో ఎంవీ గణేష్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదనరావు, ఐకేపీ ఏపీడీ సన్యాసిరావు, ఏటీడబ్ల్యూవో మంగవేణి పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు: ఎస్పీ



అర్జీదారుల సమస్యలు వింటున్న ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, మే 19(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దని ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో పీజీఆర్‌ఎస్ నిర్వహించారు. పీజీఆర్‌ఎస్‌లో 6 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ తెలిపారు. అధిక వడ్డీలు, భూ వివాదాలు, సైబర్ క్రైం, ప్రేమ పేరుతో మోసాలు, కుటుంబ తగాదాలు, నకిలీ పత్రాలు, అత్తారింటి వేధింపులు, తదితర అంశాలపై ఎక్కువగా ఫిర్యాదులు అందినట్లు ఆయన తెలిపారు. డీసీఆర్‌బీ ఎస్‌ఐ ప్రకృద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.4,215.30 కోట్లతో పీఎల్ క్రెడిట్ ప్లాన్ ఆమోదం

పార్వతీపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించి పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్(పీఎల్‌పీ)(2025-26)ను రూ.4,215.30 కోట్లతో ఆమోదించారు. నాబార్డు రూపొందించిన ఈ ప్లాన్‌ను స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన జిల్లా పారిశ్రామిక ప్రమోషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ విడుదల చేశారు. ప్రాధాన్యతా రంగాలకు రుణాలు పెంచడం, మౌలిక సదుపాయాలు అంతరాలను తగ్గించడం, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం, ఈ ప్రణాళికలో ప్రాధాన్యత ఇచ్చినట్లు ఆయన తెలిపారు. మొత్తం రుణ సామర్థ్యం 4,215.30 కోట్లు, ఇందులో మౌలిక సదుపాయాలు, అనుబంధ రంగాలకు రూ.3,316.04 కోట్లు, ఎంఎస్‌ఎంఈలకు రూ.386.69 కోట్లు, గృహ నిర్మాణానికి రూ.221.40 కోట్లు, విద్యకు రూ.21.68 కోట్లు, ఎగుమతి క్రెడిట్ రూ.5.10 కోట్లు, పునరుత్పాదక ఇంధనానికి రూ.25.24 కోట్లు, సామాజిక మౌలిక సదుపాయాల కు రూ.107.24 కోట్లు, ఇతర రంగాలకు రూ.131.90 కోట్లు కేటాయించారని ఆయన వివరించారు. ఈ ప్రణాళికలో రంగాలవారి క్రెడిట్ విభజనలో పంట రుణాలకు రూ.2,379.50 కోట్లు, అనుబంధ కార్యకలాపాలకు టర్మ్ రుణాలకు రూ.37.54 కోట్లు, వ్యవసాయ మౌలిక సదు పాయాలకు రూ.179.43 కోట్లు, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు రూ.88.10 కోట్లు కేటాయించినట్టు తెలిపారు.

వివిధ రంగాల్లో సామర్థ్యం పెంపునకు దోహదం

కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ జిల్లాలో వివిధ రంగాల్లో సామర్థ్యాన్ని పెంచడానికి సహాయపడుతుందని తెలిపారు. 2023-24 కార్యాచరణ ప్రణాళికలో క్రెడిట్, డిపాజిట్ నిష్పత్తి 168 శాతం సాధించామని, 3.2 లక్షలకు పైగా పీఎంజేడీవై ఖాతాలు తెరిచామని, నిరర్థక ఆస్తులను 1.6 శాతం వద్ద తగ్గించామని నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి దినేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో కె.హేమలత, డీపీవో టి.కొండలరావు, జిల్లా పరిశ్రమల అధికారి కరుణాకర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ విజయస్వరూప్ హాజరయ్యారు.

ఎంఎస్‌ఎంఈ పార్కులపై ప్రత్యేక దృష్టి సారించాలి

పార్వతీపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ పరిశ్రమల శాఖాధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటికే పాలకొండలో ఎంఎస్‌ఎంఈ పార్క్ ఏర్పాటు చేసుకున్నామని, త్వరలో పార్వతీపురంలో ఏర్పాటు చేసుకోబోతున్నామని చెప్పారు. మిగిలిన సాలూరు, కురుపాం నియోజకవర్గాల్లో స్థలాలు గుర్తించినప్పటికీ ప్రారంభించుకోవాల్సి ఉందని తెలిపారు. ప్రధానమంత్రి విశ్వకర్మయోజన స్థితిని సమీక్షిస్తూ శిక్షణ పొందిన లబ్ధిదారుల డేటాను వేరు చేసి సంబంధిత ఎంపీడీవో, ఏపీఎం, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, సంక్షమ సహాయకులకు తెలియజేయాలని ఆదేశించారు. ఎంఎస్‌ఎంఈ సర్వేలో మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని అందరు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామ, వార్డు సచివాలయాలు సెక్రటరీలను ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ గడువులోగా పూర్తి చేశారన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిశీలించి సంబంధిత అధికారులు ఆమోదం తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28 నుంచి ఈనెల 15వ తేదీ వరకు మొత్తం 97 దరఖాస్తులను స్వీకరించామని చెప్పారు. వాటిలో ఏపీపీ సీబీ వద్ద మూడు, ఫ్యాక్టరీల వద్ద ఒకటి, లీగల్ మెట్రాలజీ విభాగం వద్ద మూడు వెరసి మొత్తం ఏడు పెండింగ్ మినహా మిగిలిన 90 దరఖాస్తులకు ఆమోదం తెలిపినట్టు పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ కలెక్టర్‌కు వివరించారు. అలాగే 2022 ఏప్రిల్ 4 నుంచి ఇప్పటివరకు 398 అనుమతులు జారీ కాగా, వాటిలో వ్యవసాయ, ఆహార ఆధారిత పరిశ్రమలు 39, జనరల్ ఇంజనీరింగ్ 3, ఖనిజ ఆధారిత 2, చెక్క ఆధారిత ఉత్పత్తులు 1, పేపర్ ఆధారిత ఉత్పత్తులు ఆరు, రవాణా రంగం 5, సర్వీసింగ్ సెక్టార్లు 33, ఇతర తయారీ కేంద్రాలు 3, ఎలక్ట్రికల్, ఎల క్ట్రానిక్స్ యూనిట్లు మూడు వెరసి మొత్తం 94 యూనిట్లు గ్రౌండింగ్ అయినట్టు చెప్పారు. పీఎం విశ్వకర్మ కింద జిల్లా వ్యాప్తంగా 25,493 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో 1,253 మందికి శిక్షణ ఇచ్చామని, 76 మందికి రుణాలు మంజూరు చేశామని చెప్పారు. మిగిలినవి వివిధ స్థాయి పరిశీలనల్లో ఉన్నాయన్నారు. పీఎంఈజీపీ పురోగతి స్థితిని సమీక్షించిన కలెక్టర్ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిని కూడా తీసుకుని వారి ద్వారా ఎంప్లాయిమెంట్ జనరేషన్ కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో కె.హేమలత, జిల్లా పరిశ్రమల అధికారి ఎంవీ కరుణాకర్, సహాయ సంచాలకులు పి.సీతారాము, రామకృష్ణ, ఐపీవో కిరణ్, డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఎన్.విజయస్వరూప్, నాబార్డు ఏజీఎం దినేష్, డీపీవో టి.కొండలరావు, అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ

పార్వతీపురంటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని 30 వార్డుల్లో ఆయన సోమవారం పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి సరఫరాకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. మున్సిపాల్టీలోని 30 వార్డుల్లోగల ప్రతి వీధికి సంపూర్ణంగా తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. అలాగే పైప్‌లైన్ లీకుల మరమ్మతులతో పాటు పారిశుధ్య నిర్వహణపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు. రానున్న ఇప్పలపోలమ్మ, యర్రకంచమ్మలతో పాటు బెలగాం బంగారమ్మ తల్లి పండుగల్లో తాగునీటి సరఫరాకు ఎటువంటి అంతరాయం కలగకుండా కార్యచరణ ప్రణాళికలను రూపొందించామని చెప్పారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయండి

జియ్యమ్మవలస, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి జన్మాన్ గృహ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహ నిర్మాణశాఖ మండల ఏఈ ఎల్.ఉమామహేశ్వరరావు కోరారు. మండలంలోని గెడ్డతిరువాడ పంచాయతీ చిలకలవానివలస గ్రామంలో ఆయన సోమవారం పర్యటించి, పీఎం జన్మాన్ గృహ లబ్ధిదారులలో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఈసందర్భంగా ఏఈ మాట్లాడుతూ మండలంలో ఈ పథకం కింద 217 గృహాలు మంజూరు కాగా, ఇందులో బీబీఎల్ స్థాయిలో 111 గృహాలు, ఆర్‌ఎల్ స్థాయిలో 36 గృహాలు, ఆర్‌సీ స్థాయిలో 27 గృహాలు ఉన్నాయని వివరించారు. ఐదు ఇళ్లు పూర్తి కాగా, 38 ప్రారంభం కాలేదని తెలిపారు. గృహ నిర్మాణ సిబ్బంది ఉన్నారు.

ఆరోపణలు మానుకోవాలి

పాలకొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు తమపై ఆరోపణలు చేయడం మానుకోవాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఆకుల మల్లీశ్వరి, కుమార్ దంపతులు, ఎంపీపీ బొమ్మాళి భాను సుధాకర్ దంపతులు అన్నారు. సోమవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. తాము వైసీపీలో ఉన్నప్పుడు సరైన ప్రాధాన్యత లేకుండాపోయిందని, తమ పట్ల చిన్నచూపు చూడడం వల్లనే పార్టీని వీడామన్నారు. వైసీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు మానుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

చంద్రపూర్ సమితిలో ఫిర్యాదుల స్వీకరణ

ఒడిశా

రాయగడ, మే 19 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ పారుల్ పట్వారి ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ నబీన్‌చంద్రనాయక్ అధ్యక్షతన చంద్రపూర్ సమితిలో సోమవారం ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో 15 మంది అర్జీదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిశీలించిన అదనపు కలెక్టర్ పరిష్కరించవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అమూల్యకుమార్ ధర్, జడ్పీ పాలనాధికారి అక్షయ్‌కుమార్ ఖెముండు, గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్‌దీప్‌కౌర్, అన్ని విభాగాల ముఖ్యఅధికారులు పాల్గొన్నారు.

వాణిజ్య సముదాయానికి జరిమానా

రాయగడ, మే 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేకే రోడ్డు మార్గంలో ఉన్న ఓ వాణిజ్య సముదాయంలో గడువు ముగిసిన వస్తువులు అమ్మినందుకు అధికారులు లక్ష రూపాయలు జరిమానా విధించారు. ఓ వినియోగదారుడి ఫిర్యాదు మేరకు ఆహారభద్రతా అధికారులు సోమవారం ఆ మార్ట్‌లో తనిఖీలు నిర్వహించారు. గడువు ముగిసిన ఆహార వస్తువులను గుర్తించారు. ఈ మేరకు లక్ష రూపాయలు జరిమానా విధించారు.

గిరిజన విద్యార్థులకు సత్కారం

సీతంపేట రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన గిరిజన విద్యార్థినిలకు ఏఎంవో కోటిబాబు, హెచ్ఎం ఆరిక భాస్కరరావులు సోమవారం బూర్జగూడ గ్రామంలో సత్కరించారు. సామరెల్లి ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన సంజన, కావ్య, శ్రీలక్ష్మిలను ప్రోత్సహిస్తూ నగదు పురస్కారాన్ని అందజేశారు. ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సుందరయ్యకు నివాళి



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

పాలకొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభను మండల కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దావాల రమణారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీపీఎం నాయకు లు పాల్గొన్నారు. ● బెలగాం: సుందరయ్య వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో సీపీఎం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సీపీఎం నాయకుడు ఎం.కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, బీవీ రమణ పాల్గొన్నారు.

ఘనంగా తొలేళ్లు

(ఐదో పేజీ తరువాయి)

భక్తజనాన్ని నియంత్రించడానికి పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. తొలేళ్ల ఉత్సవం పూర్తయిన వెంటనే అమ్మవారి పూజను ఆలయ అనువంశిక ధర్మకర్త విక్రమచంద్ర సన్యాసిరాజు(యువరాజు)కు మంత్రి సమక్షంలో ఉత్సవ కమిటీ అందజేసింది. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అక్కేన అప్పారావు, నిమ్మాది తిరుపతిరావు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్‌పీ.భంజ్‌దేవ్, ఏఎంసీ మాజీ చైర్మన్ కేతిరెడ్డి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు మినీ మహానాడు

గుమ్మలక్ష్మీపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో మంగళవారం మినీ మహానాడు నిర్వహిస్తున్నట్టు కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగదీశ్వరి తెలిపారు. ఈ మహానాడు కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలన్నారు.

● పాలకొండ: ముఖ్యమంత్రి ఆదేశాను సారం మంగళవారం ఉదయం 9.30 గంటలకు సీఎల్‌నాయుడు కల్యాణ మండపంలో మినీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి తెలిపారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

శ్యామలాంబకు ఎస్టీ కమిషన్ చైర్మన్ పూజలు

సాలూరు రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): సాలూరు గ్రామదేవత శ్యామలాంబ పండుగ సందర్భంగా రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు సతీసమేతంగా సోమవారం అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. గద్దెను దర్శించి ఘటాలకు పూజలు చేశారు. సిరిమాను, అంజలి రథాన్ని దర్శించుకున్నారు.

పాఠశాలల పరిశీలన

కురుపాం, మే 19(ఆంధ్రజ్యోతి): కురుపాంలో గల రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాలను కురుపాం మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె.సౌమ్య జోస్పిన్ సోమవారం పరిశీలించారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలికలు, బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలు, ఎంజేపీ, కేజీబీవీ, ఆదర్శ పాఠశాల, ఎస్సీ, బీసీ వసతిగృహాల్లో వసతి సదుపాయాలపై ఆరా తీశారు. పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని ఆమె సూచించారు.

బాధితులకు సామగ్రి పంపిణీ

గరుగుబిల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): చినగుడబ గ్రామంలో అగ్నిప్రమాద బాధితులకు పార్వతీపురం రెడ్‌క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ ప్రతినిధులు సోమవారం నిత్యావసర సామగ్రిని అందించారు. బాధితులకు నిత్యావసర సరుకులతో పాటు దుప్పట్లు, వస్త్రాలు, వంట పాత్రలు, టార్పాలిన్లు అందించామని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు చెప్పారు. టీడీపీ ప్రతినిధులు ఎం.తవిటినాయుడు, నారాయణస్వామి, సర్పంచ్ ముదిలి దుర్గాప్రసాద్, రెడ్‌క్రాస్ ప్రతినిధి బోటు రామకృష్ణ పాల్గొన్నారు.